


**"ఆల్ ది బెస్ట్"**
**"ఆల్ ది బెస్ట్"**
**సతీష్, మోహన్ గ్లాసులు పైకెత్తి శుభాకాంక్షలు చెప్పుకొని విస్కీ రుచి చూశారు.**

క్లబ్ బార్ కిక్కిరిసి వుంది. ఇంకా జనం వస్తూనే వున్నారు. క్లబ్ లోపలికి రావడానికి వేరే గుమ్మాలు వున్నా, అందరూ బార్‌లో నుంచే ప్రక్కదారి చూసుకుంటున్నట్లనిపించింది మోహన్‌కి. ఒక్కొక్కళ్ళో, భార్య సమేతం గానో రావడం, నలుగుర్నీ పలకరించడం, ఆ తరువాతే వాళ్ళు చెయ్యదల్చుకున్నది నిర్ణయించు కోవడం మామూలనిపించింది. "బార్‌లో నుంచి తప్ప మీ క్లబ్‌లో ఎవ్వర్నీ అడుగుపెట్ట నివ్వరా?" అన్నాడు సతీష్ చిలిపిగా నవ్వుతూ.

"నువ్వు బాగానే కనిపెట్టావు. ఈ క్లబ్ స్వర్గానికి బారే అన్వేషణ మార్గం..."

ఇంకా వీదో అవబోతుంటే ఎవరో సతీష్ భుజం మీద చరిచి "హాయ్" అన్నారు.

"హాయ్, గోపాల్ గుడీవినింగ్" అన్నాడు సతీష్ వెనక్కి తిరిగి చూసి.

"గోపాల్ ఇతను నా స్నేహితుడు మోహన్," అని మోహన్‌వైపు తిరిగి అన్నాడు. "గోపాల్ వుంటే అమోఘంగా ప్రొద్దుపోతుంది... చెప్పడం మర్చిపోయాను. మన తెలుగువాడే, అయితే, చాలా కాలంగా కోయంబత్తూర్‌లో స్థిరపడిపోయిన కుటుంబం". "అలా కొట్టి పారేస్తావేమిటి, మీ స్నేహితుడు నాకు తెలుగు రాదను కోగలడు" అన్నాడు గోపాల్. "ఏడో క్లాసు వరకూ రాజమండ్రిలో మా పెద్దమామయ్యగారింట్లో వుండి స్కూలుకెళ్ళాను". "అలాగా, నాకెప్పుడూ చెప్ప లేదే" అన్నాడు సతీష్.

మోహన్, గోపాల్ కరచాలనం చేశారు.

"సోడాకావాలా, నీళ్ళా" గోపాల్‌ని అడిగాడు సతీష్.

సోడా, ప్లీజ్.

గోపాల్‌కి విస్కీ, సోడా తీసుకొచ్చాడు సతీష్. ముగ్గురూ విస్కీ గ్లాసులు పైకెత్తి "ఛీయర్స్" చెప్పుకొని తాగడానికి ఉపక్రమించారు.

నీలూ ఎక్కడ? అన్నాడు సతీష్.

డాన్స్ చేస్తూంది. అన్నాడు గోపాల్.

మోహన్ నువ్వు నీలూని కలుసుకోవాలి. మీ ఇద్దరికీ బాగా పొత్తు కుదరొచ్చు. నీలూ, నీలాగే పుస్తకాల పురుగు. కవిత్వం కూడా రాస్తుందనుకుంటాను కదూ గోపాల్ అన్నాడు సతీష్.

గోపాల్ కొంచెం గర్వంగా అభినందనల్ని స్వీకరించి చిరునవ్వి వూరుకున్నాడు.

"ఏవైనా పత్రికల్లో వేసేరా? అడిగాడు మోహన్.

ఆ చాలా వాట్లకి పంపిస్తూ వుంటుంది. అన్నాడు గోపాల్.

వేటికి?

నాకు సరిగ్గా తెలియదు తన్నే అడగండి. కొంచెం సేపట్లో ఇక్కడుంటుంది.

మోహన్ అంతటితో వదిలిపెట్టలేదు.

సాధారణంగా దేనిమీద రాస్తారు?

గోపాల్ కొంచెం ఇబ్బందిగా సణిగాడు.

నాకు తెలియదు.


మీరావిడ రచనల్ని చదవరా?

సతీష్ అడ్డం వచ్చాడు. భార్య రాసినవి చదవక పోవడమే మంచిది కదా! ముఖత చెప్పనివి రాతల ద్వారా తెలుసుకోవలసిన అగత్యం పట్టదు అన్నాడు. ముగ్గురూ నవ్వేరు.

చెప్పటం మర్చిపోయాను. మా మోహన్ పేరు మోసిన పత్రికా సంపాదకుడు. అందుకే, రచనల ప్రసక్తి రాగానే వుండబట్టలేక నీ స్వంత విషయాల్ని కెలికాడు. నవ్వేడు సతీష్.

గోపాల్ నన్ను మన్నించాలి. ఇది మీ స్వంత విషయమన్న మాట నాకు తట్టనే లేదు. అలవాట్లో పొరపాటు అన్నాడు మోహన్.

ఏం పరవాలేదు లెండి. నా నిరక్షరాస్యత బయట పడిందన్న బాధ తప్ప, దీంట్లో సతీష్ చెప్పినంత తప్పేం లేదు.




అనవసరంగా కబుర్లు భారంగా మళ్ళినందుకు గోపాల్ కొంచెం నొచ్చుకున్నాడు. ఎలా సరిచెయ్యాలా అని ఆలోచించాడు.

మీరు ఎక్కడ వుంటారు? అని అడిగాడు.

హైదరాబాద్‌లో. మీరీ టీ ఎస్టేట్లలో పని చేస్తున్నా రనుకుంటాను అన్నాడు మోహన్.

అవును సతీష్‌లాగే నేనూ ఈ కంపెనీలో ఒక ఎస్టేట్‌కి మేనేజర్ని. అని అడిగాడు గోపాల్ మీరు ఇక్కడికి రావడం మొదటిసారా?

అవును. ఎన్నో ఏళ్ళ నుంచి రమ్మని సతీష్ ప్రాణాలు తీస్తున్నా పడలేదు. ఇంతకు ముందే ఎందుకు రాకపోయానా అని ఇప్పుడు అనిపిస్తోంది. ఈ ప్రకృతి సౌందర్యంలో అన్నీ మర్చిపోయి ఊహా లోకాల్లో విహరించొచ్చు.

"నాలుగు రోజులకి వచ్చిన వాళ్ళకి బాగానే వుంటుంది. ఇక్కడ పనిచేసే మాకు మాత్రం ఈ సౌందర్యాలేవీ కనిపించవు. ఎక్కడిలాగే బ్రతుకు పోరాటం"

"అది ఎక్కడైనా వుండేదే ననుకోండి. అయినా ఈ పరిసరాలు దాని వుధృతాన్ని కొంచెం అయినా తగ్గిస్తాయనిపిస్తుంది నాకు".

"అయితే, చూడండి. ఈ బార్‌కీ మీ పట్టణాల్లో బార్లకీ ఏమైనా తేడా వుందా?"

"క్లబ్‌ల్లోపలి వాతావరణం కాదుగా నేనన్నది"

"బయట కొండలూ, పచ్చటి టీ, కాఫీ తోటలూ, స్వచ్ఛమైన గాలి అన్నీ వున్నాయి. నిజమే. కాని వాటి మధ్య పని చెయ్యడానికి తోటి మనుష్యులతో స్పందించవలసిందే కదా? పెద్దా చిన్నా తారతమ్యాలూ, స్పర్థలూ కావేషాలూ, నటనలూ, ఆశ్రిత పక్షపాతాలూ, అన్ని చోట్లా వున్నట్లే ఇక్కడకూడా అదే మోతాదులో తాండవిస్తూ వుంటాయి. వీటి గొడవలో ప్రకృతి నైర్మల్యాన్ని పట్టించుకునే వ్యవధి ఎక్కడ వుంటుంది?"

గోపాల్ వాక్ప్రవాహానికి సతీష్ అడ్డు తగిలాడు. "ఇక్కడేదో భూతల స్వర్గం వుంది. నువ్వు అనుభవించి తీరాలి. అని ఏళ్ళ తరబడి పోరుపెట్టి మోహన్ని ఎలాగో ఇక్కడికి లాక్కొస్తే, నువ్వేమిటి అతణ్ణి బెదరగొట్టేస్తున్నావ్?"

"చూడు, సతీష్ ఇక్కడంతా దివ్యంగా వుందని నమ్మడానికి మోహన్ నీలాగా భోళా భాళీ మనిషనుకోను" అని మోహన్‌వైపు తిరిగాడు. "మోహన్ బార్ పొడుగునా ఇసుక వేస్తే రాలకుండా నుంచున్న ఈ గుంపుల్ని చూడండి. నవ్వుతూ తుళ్ళుతూ, కులాసాగా గడుపుతున్నట్లనిపిస్తుంది గదా! ఉత్తి మోసం. అందరూ పై అధికారి చూపుల్లో పడ్డానికీ, అవకాశం వస్తే వాణ్ణి వుబ్బేసి ఏదో లాభం పొందడానికీ మాత్రమే ఇక్కడ చేరుతారు" అన్నాడు గోపాల్.

"గోపాల్ ప్రస్తుతం అలాగే మాట్లాడతాళ్ళే, మోహన్ పట్టించుకోకు. కంపెనీ ప్రెసిడెంట్‌తో ఈ మధ్యనే ఘర్షణపడ్డాడు. అయినా అతనికేం భయం లేదు. మంచి పనిమంతుడు" అన్నాడు సతీష్.

"గాడ్ బ్లెస్ యూ సతీష్. నువ్వు చెప్పేది నిజమని నమ్మాలని ఆశగా వుంది. దానికోసం ఇంకొక విస్కీ తాగుదాం" అని బేరర్‌ని పిలిచి మూడు గ్లాసులు బ్లాక్ లేబుల్ విస్కీ, సోడా అడిగాడు.

గోపాల్ మాటల్తో మోహన్ మొదటిసారిగా బార్‌ని కలయజూశాడు. అతని దృష్టి బార్‌కి ఒక చివర నలుగురి మధ్య నుంచుని మాట్లాడుతున్నతనిపై పడింది. పొడుగ్గా, ఠీవీగా వున్నాడు. వినేవాళ్ళ ఏకాగ్రతని గుత్తకి పుచ్చుకున్నట్టున్నాడు. అంత దూరం నుంచి కూడా మాటలు వుచ్చరించడంలో దర్పం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. గ్రే సూటు, లేత నీలం రంగు చొక్కా, తెల్ల కాలరూ, ఏటవాలు చారల జేగురురంగు నెక్ టై అతికినట్టు సరిపోయాయి.

"సతీష్ అతను కుమార్ కదూ?" అన్నాడు చూపిస్తూ మోహన్.

"అవును విజయ్‌కుమార్. నీకెలా తెలుసును?"

"ముప్ఫై ఏళ్ళుగా తెలుసు. ఒకప్పుడు మంచి కథలు రాసేవాడు. ఇంకా ఎంతో సాధిస్తాడని మేం ఆశలు పెంచుకుంటున్నప్పుడు అకస్మాత్తుగా రాయడం మానేశాడు. మళ్ళీ రాయించాలని నేనెంతో ప్రయత్నించాను, లాభం లేకపోయింది" అన్నాడు మోహన్.

"గుడ్ గాడ్! విజయ్ కథలు కూడా రాస్తాడన్న మాట" గోపాల్ అరిచినంత పని చేశాడు.

"ఇప్పుడు రాయటల్లేదన్నాడుగా, వూరుకో" అన్నాడు సతీష్. చిరునవ్వు నవ్వుతూ, "గోపాల్ దెబ్బలాడింది విజయ్‌కుమార్‌తోటే" అన్నాడు మోహన్‌తో గోపాల్ గట్టిగా మాట్లాడినందుకు సంజాయిషీ తోచేలా.

"అంతా శుభప్రదంగా సర్దుకుంటుందని ఆశిస్తూ తాగేశాంకదా! బ్లేక్ లేబిల్ వంచించడం నా అనుభవంలో ఎరుగను" అన్నాడు మోహన్.

అందరూ నవ్వేరు.

"సతీష్ నేవెళ్ళి కుమార్‌తో కాస్త మాట్లాడి వస్తాను, సరేనా?" అడిగాడు మోహన్.

"దానికేం, రా నేనే నిన్ను తీసుకువెళతాను" అన్నాడు సతీష్.

"నన్నొక్కణ్ణే ఇలా వదిలేసి వెళ్ళడం అన్యాయం" అన్నాడు గోపాల్.

"మోహన్‌ని విజయ్‌కి అప్పజెప్పి వచ్చేయడమే" అన్నాడు సతీష్. "ఈవేళంతా మనం ముగ్గురం కలిసే వుందాం. నీకూ, మోహన్‌కీ బాగా కుదిరినట్టుంది. డిన్నర్‌కి మేం టేబిల్ రిజర్వ్ చేసుకున్నాం ముగ్గురికి. నువ్వూ చేసుకొని వుండాలి. మీది ఎంత మందికి?"

"ఇద్దరికి. నీలూ, నేను"

"అయితే ఇకనేం. రెండు టేబిల్స్ కలుపుకుందాం. ప్రభతో చెప్తాను. సంతోషంతో ఎగిరి గంతేస్తుంది" అన్నాడు సతీష్.

ప్రభ సతీష్ భార్య.

"సరే" అన్నాడు గోపాల్.

సతీష్, మోహన్ కదలబోతుంటే మోహన్ భుజం పట్టుకుని ఆపి, గోపాల్ అన్నాడు, "మీరేం చెయ్యాలో చెప్పే హక్కు నాకు లేకపోయినప్పటికీ ఒక చిన్న విన్నపం".

"ఏమిటి?" మోహన్.

"విజయ్‌ని వుబ్బేసి, మళ్ళీ రాసేలా చెయ్యకండి, మేం బ్రతకలేం" అన్నాడు గోపాల్.

గోపాల్ ఆందోళనకి నవ్వి అన్నాడు సతీష్. "గోపాల్ గోరంతలు కొండంతలు చేస్తున్నాడు కాని, నీ స్నేహితుడు తన కథల్ని మా అందరిచేతా నిర్బంధంగా చదివించగల ప్రబుద్ధుడు" అన్నాడు. "తను లెక్కల్లో మనిషినని అతని ఉద్దేశం".

"లెక్కల్లో మనిషేమిటి? తను ప్లాంటేషన్లకి దేవుడిచ్చిన వరం అని అతని నమ్మకం" అన్నాడు గోపాల్.

"మీ మాటల్నిబట్టి చూస్తుంటే కుమార్ ఉద్యోగంలో బాగా పైకొచ్చినట్టు కనిపిస్తోంది" అన్నాడు మోహన్.


"మూనార్ ప్లాంటేషన్లకి అతను ప్రెసిడెంట్" అన్నాడు సతీష్.

"మనందరికీ మొగుడని చెప్పవేం" అన్నాడు గోపాల్.

"మూనార్ ప్లాంటేషన్లు యాభైవేల ఎకరాల టీ కంపెనీ. దక్షిణాదిని ఇంతకంటే పెద్దది లేదు. ఇంత వరకు ప్రెసిడెంట్లందరూ ఇంగ్లీషు వాళ్ళే. విజయ్ కుమార్ మొదటి ఇండియన్ ప్రెసిడెంట్" విడమర్చి చెప్పాడు సతీష్.

"ఆపేశావేం, మిగతాది కూడా పూర్తి చెయ్యి" అన్నాడు గోపాల్.

సతీష్ మాట్లాడలేదు.



గోపాల్ మళ్ళీ అందుకున్నాడు.

"మోహన్, కంపెనీ చాలా మట్టుకు ఇండియన్ల అధీనంలోకి వచ్చేసింది. ఇప్పుడు డైరెక్టర్లలో ముప్పాతిక మంది ఇండియన్లే. ఇంగ్లీష్ (పెసిడెంట్ బోర్డుకి అణుకువగా అణిగిమణిగి వుండడని వాళ్ళ భయం. తమ మోచేతి నీళ్ళు తాగే ఇండియన్ కోసం గాలించి విజయ్ కుమార్ని ఎన్నుకున్నారు.

"విజయ్‌లో సత్తా కూడా వుంది" అన్నాడు సతీష్.

"పీఠం మీద కూచోబెట్టాలే కాని ఇన్నేళ్ళ అనుభవం వున్నవాడెవడికైనా వస్తుంది ఆ మాత్రం సత్తా" అన్నాడు గోపాల్.

"అతనిమీద నీకెంత కోపంగా వున్నా కొంచెం న్యాయంగా మాట్లాడు గోపాల్. పోయిన అయిదారేళ్ళలో కంపెనీని అతనెంత పైకి తీసుకొచ్చిందీ నీకు తెలుసు" అన్నాడు సతీష్.

"మోహన్, అందరూ సతీష్‌లాగ ఈ పడికట్టు రాళ్ళు ఏకరువు పెట్టే వాళ్ళేకాని అసలు రహస్యం గ్రహించరు. ప్లాంటేషన్ల పరిస్థితి పూర్తిగా దిగజారిపోయి మూసేసే పర్యంతం వచ్చిన సమయంలో అదృష్టం కొద్దీ కంపెనీ విజయ్ చేతుల్లోకి వచ్చింది. చేసేదేం లేక కొత్త పద్ధతుల్ని ప్రవేశపెట్టి జూదంలో నెగ్గాడు. దాన్ని మహా ధైర్యసాహసాలుగా పొగిడేస్తూ వుంటారు" అన్నాడు గోపాల్.

"ఏమైనా అను ప్లాంటేషన్లు తిరిగి పుంజుకోవడానికి విజయ్ పెట్టిన ఒరవడే కారణం. అందుకు గర్వపడ్డం ఏమంత తప్పుకాదని నా అభిప్రాయం" అన్నాడు సతీష్.

"అంతే అయితే నాకూ ఆక్షేపణ లేదు. అస్తమానూ కింది వాళ్ళు వందిమాగధుల్లా తన ప్రజ్ఞని స్తుతిస్తూ వుండాలంటే ఎలా? పైగా అది ఒక్క పనిలోనే కాదు, అన్నిట్లోనూ. ఎప్పుడో టెన్నిస్ ఛాంపియన్ అట. ఇప్పటి వరకు ఎవ్వర్నీ మర్చిపోనివ్వడు. కబుర్లలో అతని విసుర్లకి అందరూ కేరింతలు కొట్టవలసిందే. చివరికి ఇల్లెంత అందంగా పెట్టుకుంటాడో, తోటలో పూల మొక్కల్ని ఎంచుకోవడంలో ఎంత నాగరికత ప్రదర్శిస్తాడో, బట్టలు వేసుకోవడంలో ఎంత అభిరుచి కురిపిస్తాడో కూడా అదే పనిగా మనం శ్లాఘించాలి".

"నువ్వేవీ చెయ్యకుగదా, నీకేవీ నష్టం రాలేదు. ఇంకమీద కాదు కూడా. ఊరుకో" అన్నాడు సతీష్.

"నాకేదో అవుతుందన్న భయం లేదు. నేను కష్టపడి పనిచేస్తాను. ఆ రక్షణ నాకు చాలు. మీరందరూ అతన్నిలా అనవసరంగా వుబ్బేయడమే ఎబ్బెటుగా వుంటుంది" అన్నాడు గోపాల్.

"అతన్ని వుబ్బేస్తే మోహన్‌కి ఒరిగేదేమీ లేదుగా, ఆ పని చెయ్యడు. ఇంక మేం కదలడానికి అనుమతిస్తావా?" అంటూ, మోహన్ వీపుమీద చెయ్యివేసి బార్ దగ్గర గుంపుల్ని తప్పించుకుంటూ విజయ్‌కుమార్ వైపు దారి తీశాడు సతీష్. వెనకాలే గోపాల్ మనుష్యుల్ని తోసుకుంటూ మోహన్ని కలుసుకుని చెవిలో వూదాడు. "నా మనవి మర్చిపోకండి. విజయ్‌ని మళ్ళీ రాయమని ప్రోత్సహించకండి. వదివి పొగడలేక చావాలి. నా భార్య రాసిన

# కొత్త సభ్యత్వం

ఈ మధ్యే ఈ లోకంలోకొచ్చి
ఇవాళే ఇంటికొచ్చింది
ఈ పాప. మా పాప.

క్షయ సంవత్సరంలో పుట్టింది
క్షయ మెరుగని జాబిలి కూనలా.
ఆషాఢ మాసంలో పుట్టింది
వర్షామధువు చిందే మబ్బు గుత్తిలా.
కృష్ణ పక్షంలో పుట్టింది
శ్యామలాకాశంలో సిరివెన్నెలలా.
నవమినాడు పుట్టింది
నవ జీవన కావ్యానికి నాందిలా.
చల్లని సాయంకాలం పుట్టింది
మెల్లగా వ్యాపించే పూల పరిమళంలా.

జాతకం చూడాలా
జాబిల్లి ఉదయిస్తే?
మంచిదేనా అని అడగాలా
మబ్బు తొలకరిస్తూంటే?
వేరే శాంతి జరిపించాలా
వెన్నెలలు కాస్తూంటే?
తారాబలం బాగుండదూ
రమ్య కావ్యం రక్తి కడుతూంటే?
నామకరణం ఎందుకూ
సమ సౌమ్య సౌరభానికి?

దివి నుండి దిగి
వచ్చిన చిన్నారి దేవతకి
వెంటనే ఇంటిలో
జీవిత సభ్యత్వమిచ్చి
దీవించకుండా
మీన మేషాలు లెక్కించేవాళ్ళని
ఏమనాలో తెలియదు నాకు.

—కె. గోదావరి శర్మ

గీతాల్నీ చదవని వాడ్నని గుర్తుపెట్టుకొని కనికరించండి".

** ** **

"విజే, ఇక్కడెవరో చూడు" అన్నాడు సతీష్.

"మోహన్ ఇక్కడెలా వూడిపడ్డావ్?" సంతోషంగా, ఆశ్చర్యంగా అరిచినంత పనిచేసి మోహన్ని కౌగిలించుకున్నాడు విజయ్‌కుమార్.

తన స్నేహితుల్లో ఒక్కొక్కరికీ అతన్ని ఆప్యాయంగా పరిచయం చేశాడు.

"ఇంకా జ్ఞాపకం వున్నానే" అన్నాడు మోహన్.

"నిన్నెలా మర్చిపోతాననుకున్నావ్? అది కాకపోయినా, ఒకసారి చూసిన మొహం, విన్న పేరూ మర్చిపోవడం అనేది నాకు లేదు" అన్నాడు విజయ్ కుమార్.

"వలభై ఎస్టేట్లలో ప్రతి చిన్నా పెద్దా ఉద్యోగి పేరూ విజయ్‌కి జ్ఞాపకం. వాళ్ళ ఉద్యోగ చరిత్రంతా కంఠోపాఠం. మాకాశ్చర్యమేస్తుంది" అన్నాడు అశోక్ మల్‌హోత్ర.

"నువ్వు నా బాధ్యతలు తీసుకోవలసి వచ్చినప్పుడు నీకూ అలాగే జ్ఞాపకం వుంటుంది" అన్నాడు విజయ్ కుమార్.

"నీ బాధ్యతలు స్వీకరించడానికి చాలా ధైర్యం కావాలి. మాలో ఎవరికీ సాధ్యపడదేమో" అన్నాడు అశోక్ మల్‌హోత్రా.

"అశోక్‌కి మాత్రం సాధ్యం కాదు" కన్నుగీటి అన్నాడు జిమ్ గ్రీన్.

"నీకా సత్తా వుందా?" సవాల్ చేశాడు అశోక్ మల్‌హోత్రా.

"నేను విదేశీయుణ్ణి. సత్తా వున్నా లేకపోయినా నన్నతని స్థానంలో వెయ్యడానికి మీ ప్రభుత్వం ఒప్పుకోదు. మీరేమో అందుకు పనికిరానివాళ్ళమని ఒప్పేసుకుంటున్నారు. విజయ్ రిటైరయిన తరువాత ఈ కంపెనీ పెద్ద తలకాయ లేకుండా నడవాలిసి వస్తుందేమో" అన్నాడు జిమ్ గ్రీన్.

"విజయ్ బాధ్యతలు ముగ్గురు నలుగురు పంచుకోవడమే మార్గం" అన్నాడు మోరిస్ చెంగప్ప.

"ముగ్గురు నలుగురు అనేకంటే నలుగురు అన్నావంటే నీ ప్రతిపాదన్ని మనస్ఫూర్తిగా ఆమోదిస్తాను, మోరిస్, "నవ్వాడు జిమ్ గ్రీన్". "అప్పుడు మన నలుగురు వైస్ ప్రెసిడెంట్లూ ప్రెసిడెంట్లు కాగలిగే అవకాశం వుంటుంది. ఏమంటావ్ అశోక్? నలుగురు ప్రెసిడెంట్లలో ఒక విదేశీయుడుండడానికి మీ ప్రభుత్వానికి ఆక్షేపణ లేకపోవచ్చు".

"ఇదంతా అనవసర ప్రసంగం. ఎవర్ని ప్రెసిడెంట్ చెయ్యాలో, ఎవరికెంత బాధ్యత అప్పజెప్పాలో విజయ్‌కి పూర్తిగా తెలుసు. కంపెనీ డైరెక్టర్లు అతని మాటమీదే నడుస్తారు" అన్నాడు గుర్మీత్ రన్‌ధావా.

జిమ్ గ్రీన్, అశోక్ మల్‌హోత్రా, మోరిస్ చెంగప్ప, గుర్మీత్ రన్‌ధావా మూనార్ ప్లాంటేషన్లకి వైస్ ప్రెసిడెంట్లు.

"ఇదంతా వింటుంటే నాకెంతో సంతోషంగా

వుంది'' అన్నాడు మోహన్ విజయ్‌కుమార్‌ని వుద్దేశించి, ''ఉద్యోగంలో ఇంత పరపతి సంపాదించావన్న మాట''.

''విజయ్ ప్రతిభ ఇంకా మీకు తెలియనట్లుందే!'' అందరూ దాదాపు ఒకే కంఠంతో అన్నారు. జిమ్‌గ్రిగ్ గొంతుకలో మాత్రం కొంచెం వ్యంగ్యం స్ఫురించింది.

''ఉద్యోగంలో సంగతి తెలియని మాట నిజమే, సాహిత్యంలో ప్రతిభ మాత్రం బాగా తెలుసు'' అన్నాడు మోహన్.

''నన్నెగతాళి చెయ్యడానికి మా వైస్ ప్రెసిడెంట్లతో పోటీకి వస్తున్నావా?'' మోహన్ వీపుమీద చరిచి మందహాసం చేస్తూ అన్నాడు విజయ్‌కుమార్.

''నిజం చెప్తున్నాను విజయ్. నీ కథలంటే నాకెంత ఇష్టమో నీకు నేను చెప్పనక్కర లేదు. నీ కథా సంపుటాన్ని విమర్శిస్తూ నేను రాసిన వ్యాసం జ్ఞాపకం వుందా?'' అన్నాడు మోహన్.

''ఏమిటి, విజయ్ కథలు కూడా రాస్తాడా?'' అన్నాడు జిమ్‌గ్రిగ్, ''క్రింద ఉద్యోగుల్ని హడలగొట్టే ఉత్తరాలు రాయడానికే అతని రచనా ప్రావీణ్యం పరిమిత మనుకున్నానే''.

''ఒకప్పుడు విజయ్ పేరుమోసిన రచయితని మీకెవ్వరికీ తెలియనట్టుంది'' అన్నాడు మోహన్.

''తెలియదు'' అన్నారు అందరూ.

''అయితే నేను చెప్పాలి... సుమారు ముప్పై ఏళ్ళ క్రితం విజయ్ గొప్ప కథలు రాశాడు.''

''నేన్నమ్మను'' అన్నాడు జిమ్‌గ్రిగ్.

అతని మాటలకి అందరూ అవాక్కయిపోయారు. మళ్ళీ జిమ్‌గ్రిగ్ అందుకున్నాడు. ''మీరు చెప్పింది నిజమైతే విజయ్ ఇప్పటివరకు ఆ విషయం బాజా వెయ్యకుండా వుంటాడా?''

విజయ్‌కి పట్టలేనంత నవ్వు వచ్చింది. తక్కిన వాళ్ళు కూడా అతనితో శృతి కలిపారు, కొంత తగ్గు స్థాయిలో.

''జిమ్, నువ్వు వాటిని చదివి అర్థం చేసుకోలేవని నీకు చెప్పలేదు'' అన్నాడు విజయ్‌కుమార్.

జిమ్‌గ్రిగ్ మొహం జేవురించింది.

''కోపం తెచ్చుకోకు జిమ్, నేను తెలుగులో కథలు రాసేవాణ్ణి'' అన్నాడు విజయ్‌కుమార్.

''అలా చెప్పు'' అన్నాడు జిమ్‌గ్రిగ్. ఇంత గొప్పవని చెప్పుకుంటున్న కథలు తెలుగులో రాసినవా అనే లేశ భావం మాచాయగా వ్యక్తం అయ్యేలా.

''తెలుగు కథలయితేనేం మీ ఇంగ్లీషు కథల్లో గొప్ప వాటితో సరితూగగలవు'' అన్నాడు మోహన్ ఆవేశంగా.

''మోహన్ నా పక్షపాతి అని జ్ఞాపకం పెట్టుకో జిమ్'' నవ్వేడు విజయ్‌కుమార్.

''అవును నేను గర్వంగా ఒప్పుకుంటున్నాను. కాని, అంత ప్రజ్ఞనీ వృధాపోనిస్తున్నందుకు నిన్ను తీవ్రంగా నిరసిస్తున్నాను'' అన్నాడు మోహన్.

''నువ్వు రచనా ప్రపంచంలో కొట్టుమిట్టాడుతున్నావ్. నీ రంగంలో మంచి ఎవరూ జారిపోవడం నువ్వు సహించలేవు'' అన్నాడు విజయ్‌కుమార్.



రచయిత : సి.రామచంద్రరావు

''పప్పులో కాలేశావ్. నా పత్రిక్కి రాసే వాళ్ళలో ఎంతమందిచేత రచనా సన్యాసం చేయించడానికి పన్నాగాలు పన్నుతూ వుంటానో వింటే ఆశ్చర్యపోతావు''.

''రాయడం మానేసి నావల్లనయిన సహకారం నేనందించానా లేదా?'' నవ్వాడు విజయ్‌కుమార్.

''ఇంకా ఎందుకు పొగడ్తల కోసం గాలం వెయ్యడం? నేను నీ కథల అభిమానినని, నీ మిత్రులందరి ముందూ ఎప్పుడో ఒప్పేసుకున్నాను కదా'' అన్నాడు మోహన్. ''నువ్వు మళ్ళీ రాయాలి విజయ్'' అని రెట్టించాడు.

''ఎందుకు?''

''నీ కథలకోసం ఆత్రంగా ఎదురుచూసే మాబోటి వాళ్ళకోసం''.

''మీ ఆనందం కోసం అన్నమాట''

''మంచి కథ రాసినప్పుడు నీకు మాత్రం సంతోషంగా వుండదా?''

''ఏమో, చెప్పలేను''

''మరెలా వుంటుంది?''

''ఒక బరువు దించినట్టుండొచ్చు'' జిమ్‌గ్రిగ్ హఠాత్తుగా మాటల్లో జొరబడ్డాడు.

''విజయ్ రాసిన కథలు నేను చదవలేదని మీకు నమ్మకంగా తెలుసుగదా, మోహన్! అతను రాసిన కథావస్తువుని ఊహించి చెప్తే నాకేం బహుమతి ఇస్తారు?'' అన్నాడు.

''ఎలా చెప్పగలరు?'' అన్నాడు మోహన్.

''ఇప్పుడేగా విజయ్ కిటుకు చెప్పేడు''

''ఏమిటది?''

''మనసుని తేలిక చేసుకోవడం కోసం రాసేవాడని''.

''బాగా పట్టేసేరే! ఇంక మీ ఊహాగానం కానివ్వండి'' నవ్వాడు మోహన్.

''ముందొక ప్రశ్న. విజయ్ కథలు రాయడం మొదలుపెట్టిందెప్పుడు?'' అడిగాడు జిమ్‌గ్రిగ్.

''యాభై రెండులో''.

''నేననుకున్నట్టేనన్నమాట. యాభై రెండులో ఏ నెల్లోనో చెప్పనా?'' అన్నాడు జిమ్‌గ్రిగ్.

మోహన్ సమాధానంగా నవ్వి వూరుకున్నాడు.


''ఏప్రిల్'' అన్నాడు జిమ్‌గ్రిగ్.

''తప్పు. యాభైరెండు జూన్ రెండవ వారం పత్రికలో అతని మొదటి కథ పడింది. నేనే వేశాను. అప్పుడు నేను సహాయ సంపాదకుడిగా వుండేవాణ్ణి. కథ చదివి ముగ్ధుణ్ణయిపోయి ఆఫీసులో అందరికీ చదివి వినిపించాను'' అన్నాడు మోహన్.

''జిమ్ గెలిచాడు మోహన్. కథ నువ్వు వేసింది జూన్‌లోనైనా, నేను రాసింది ఏప్రిల్‌లోనే'' అన్నాడు విజయ్‌కుమార్.

జిమ్‌గ్రిగ్ గర్వంగా అందరివైపూ చూశాడు.

''అదేం బ్రహ్మవిద్య కాదులే, మోహన్. జిమ్, నేనూ ఒకే ఎస్టేటులో మూడేళ్ళు అసిస్టెంటు మేనేజర్లుగా పనిచేశాం. కబుర్లలో ఎప్పుడైనా కథ రాస్తున్నా నని






## బాధను నివారించే కొత్త మందు

బాధను నివారించే నిరపాయకరమైన "ట్రిమాల్" అనే మందును బొంబాయికి చెందిన అజంతా ఫార్మా కంపెనీ తయారు చేసింది. ఇతరాలైన మందులవలె ఇది సైడ్ ఎఫెక్ట్స్ కలిగించదు. దీనిలో మూడు రసాయనాలున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలకు ఇది సరిపడిన ఔషధం. అరకప్పు కాఫీలో వుండే 'కఫిన్'తో సమానమైన ఈ ఉత్ప్రేరక ఔషధం కూడా దీనిలో వుంది. ఇది శరీరానికి ఉత్తేజాన్ని, కండరాలకి ఉమశమనాన్ని ఇస్తుంది.

చెప్పివుండొచ్చు" అన్నాడు విజయ్‌కుమార్.

"ఎప్పుడూ చెప్పలేదు, విజయ్. ఇప్పుడిలా నా గెలుపుని కించపరచడం కొట్టరానిచోట కొట్టి దెబ్బ తీయడం" అన్నాడు జిమ్ గ్రీన్.

"కాకపోతే, నువ్వింటి కొచ్చినప్పుడెప్పుడైనా రాసు కుంటూ కనిపించావేమో. కథ్రలాసే వాణ్ణని ఇప్పుడు తెలుసుకుని దానికి ముడిపెడుతున్నావ్" అన్నాడు విజయ్‌కుమార్.

"ఎప్పుడైనా ఏం ఖర్మ. ఎప్పుడూ రాత్రుళ్ళు ఏదో రాస్తూనే కనిపించేవాడివి. అయితే, నువ్వు కథలు రాస్తున్నావనుకోలేదు. ప్లాంటేషన్లని దుయ్యబడుతూ మీ నాన్నకి, అమ్మకీ ఉత్తరాలు రాస్తున్నావనుకునే వాణ్ణి" అన్నాడు జిమ్ గ్రీన్.

అందరూ నవ్వారు.

"మోహన్, ఇప్పుడు చెప్తాను వినండి. విజయ్ ఉద్యోగంలో చేరింది యాభైరెండు జనవరి ఒకటో తేదీన. మెకఫర్ సన్‌ఫర్లో లీవుమీద ఇంగ్లాండు వెళ్తే నేను ఏక్టింగ్ మేనేజర్‌గా వున్నానప్పుడు. విజయ్ రాగానే ఏదో వెర్రి గుర్తించి వెతుకుతున్నవాడిలా కనిపించాడు. టెన్నిస్ టోర్నమెంట్లకి వెళ్ళినప్పుడున్నట్టు తన కోసం ఒక ఆహ్వాన సంఘం ఎదురుచూస్తూ వుంటుందని అతని ఉద్దేశ్యం. అదేం లేకపోగా, తన టెన్నిస్ గురించి ఎవరికీ అంతగా పట్టకపోవడంతో ప్లాంటేషన్లలో పనిచేసే మనుషులమీద ఈసడింపు పెంచుకున్నాడు. వాళ్ళు అనాగరికులని దుమ్మెత్తిపోశాడు. అది వినేవాళ్ళు కూడా నెమ్మదిగా సన్నగిల్లిపోయారు. ఇంక చేసేది లేక లోపలి బాధని కథల్లో పెట్టేడు. ఈ పరివర్తన, ప్రేరణ రావడానికి మూణ్ణెల్లు పట్టిందని నా అంచనా" అన్నాడు విజయంగా మోహన్‌వైపు చూస్తూ జిమ్ గ్రీన్.

"విజయ్ ప్లాంటేషన్ల గురించి రాయలేదే" అన్నాడు మోహన్.

"ఇంకొక వాతావరణం సృష్టించి, ఇక్కడ వాళ్ళనే దాంట్లో ఇరికించి వుంటాడు" అన్నాడు జిమ్ గ్రీన్.

"అతని కథల్లో విశ్వజనీనత వుంది" అన్నాడు మోహన్.

"ఇంకొంచెం ఊహాగానం చెయ్యమంటారా?" అడిగాడు జిమ్ గ్రీన్.

"తప్పకుండా" అన్నాడు మోహన్.

"ఐదేళ్ళ తరువాత విజయ్ కథలు రాయడం మానేశాడు" అన్నాడు జిమ్ గ్రీన్.

"దీంట్లో మర్మం కూడా మీరే విడమర్చి చెప్పాలి" అన్నాడు మోహన్.

"ఐదేళ్ళలో విజయ్ మేనేజర్ అయ్యాడు. అప్పటికి అంత చిన్న వయసులో మేనేజరైన వాళ్ళు లేరు. ఎలా సాధించాడని అడక్కండి" కన్నుగీటి అన్నాడు జిమ్ గ్రీన్.

"అయితే"

"ఇంకేముంది? ప్లాంటేషన్ మనుష్యులమీద అక్కసు తీరిపోయింది. రాయాలనే ఆవేశం చల్లారి పోయింది".

గొప్ప రహస్యం ఛేదించిన వాడంత దర్పంగా అన్నాడు జిమ్ గ్రీన్.

"మీ తర్కం బాగుంది. అయితే, విజయ్‌కి అతకదు. అతను పదేళ్ళు కథలు రాశాడు. ఎవరిమీదా అక్కసు వెళ్ళకక్కలేదు" అన్నాడు మోహన్.

"జిమ్ వదరడానికేవిటిలేకాని, విజయ్ నువ్వెందుకు రాయడం మానేశావో చెప్పాలి" అన్నాడు అశోక్ మల్హోత్రా.

"పని ఎక్కువయి, తీరికలేక" అన్నాడు విజయ్‌కుమార్.

"ఇదొక వంక. కథ రాయడానికి ఇక్కడ తీరిక చేసుకోలేకపోతే ఇంకెక్కడా కుదరదు" అన్నాడు మోహన్.

"మీరు మాబోటివాళ్ళని చూసి అంటున్నారు" అన్నాడు మోరిస్ చెంగప్ప. "విజయ్ హోదాలో పని తలమునకలుగా వుంటుంది. కథలు రాసేటంత సమయం ఎలా దొరుకుతుంది?"

"విజయ్‌కి ముందు చూపెక్కువ. ఇంకొక పదేళ్ళలో కంపెనీ ప్రెసిడెంటవుతాడనీ, అప్పుడు రాయడానికి కెలాగూ తీరిక చిక్కదనీ అంచనావేసి ముందే రాయడం మానేశాడు" ఎత్తిపొడిచాడు జిమ్ గ్రీన్.

"పదేళ్ళ ముందే తెలుసునో తెలియదో కాని, స్టాన్స్‌ఫీల్డ్ రిటైరయినప్పుడు ప్రెసిడెంట్ పదవికి పోటీ మీ ఇద్దరి మధ్యనే అని స్థూలంగా తెలియగానే ప్రెసిడెంటయిపోయినంత ధైర్యంగా వుండి వుంటాడు" కంపెనీ ప్రెసిడెంటు నుద్దేశించి జిమ్ గ్రీన్ వేసిన చురకకి ప్రతి సమాధానం ఇచ్చే భారం తనమీద వేసుకొని అన్నాడు వైస్ ప్రెసిడెంట్ గుర్మీత్ రన్‌థావా.

జిమ్ గ్రీన్ ప్లాంటేషన్లలో విజయ్‌కుమార్ కంటె ముందు చేరాడు. చాలామందిని దాటి పైకి వెళ్ళినట్టే జిమ్ గ్రీన్‌ని కూడా దాటి విజయ్‌కుమార్ కంపెనీ ప్రెసిడెంట్ అయ్యాడు. అది జిమ్ గ్రీన్ దుగ్ధ. అయినా చాలా మటుకు సర్దుకుపోయేవాడు. తను సీనియర్ వైస్ ప్రెసిడెంట్. కంపెనీకి రెండవ వాడుగా వుండడం ఏమంత తక్కువగాదని సమాధానపడేవాడు. తను విదేశీయుడవడంవల్ల వివక్షణకి పాలుపడ్డాడని ఓదార్చుకునే వాడు. అయినా, అప్పుడప్పుడది మనస్సుని కలత పెట్టేది. ఇప్పుడు గుర్మీత్ రన్‌థావా మాటలు అతని గాయాన్ని కెలికాయి.

"మీ ఇండియన్లకి పనిలో సామర్థ్యం ఒక్కటే సరిపోదు" కోపంగా అన్నాడు జిమ్ గ్రీన్.

పరిస్థితి చెయ్యి దాటిపోతోందని గ్రహించాడు విజయ్‌కుమార్. ముందు ఒకటి రెండుసార్లు ఈ విషయం కబుర్లలో దొర్లినప్పుడు జిమ్ గ్రీన్ అనుచితంగా ప్రవర్తించడం జ్ఞాపకం వచ్చింది.

"ఈవాళ ఒక్క డాన్స్ కూడా మోనాతో చెయ్యలేదు. వెళ్ళి భార్యకి క్షమాపణ చెప్పుకొని రాజీ చేసుకోవాలి" అని బార్ నుంచి లౌక్యంగా నిష్క్రమించాడు విజయ్‌కుమార్.

మోహన్ కూడా తన స్నేహితుల్తో జేరడానికి కదలబోయాడు. జిమ్ గ్రీన్ చెయ్యి అడ్డం పెట్టి అతన్ని వారించాడు.

"మోహన్, మీరు కొంచం వుండండి. వీళ్ళ మాటల్లో ఏమైనా న్యాయం వుందేమో చెప్పండి" అన్నాడు.

"ఏదో తమాషాకి అన్నమాటలు, గ్రీన్, మీరు పట్టించుకోకూడదు" అన్నాడు మోహన్.

"తమాషా కాదు. మీ దేశంలో శ్వేత జాతికి న్యాయం

### గమనిక

జయరామ్ పబ్లికేషన్స్, విజయవాడవారి ఆనంద నవలాచంద్రిక పథకంలో నవలల పోటీకి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించినవారి జాబితాలో ప్రముఖ జర్నలిస్టు, రచయిత శ్రీ రెంటాల గోపాలకృష్ణ గారిని కూడా కలిపి చదువుకోవలసిందిగా ప్రార్థన.

—ఎడిటర్

జరగదు'' రెట్టించాడు జీవ్స్‌గ్రీన్.

''ఊరుకో, జీవ్స్'' అన్నాడు మోరిస్ వెంగప్ప.

''ఎందుకూరుకోవాలి? విజయ్ కంటె నేను కంపెనీలో అయిదేళ్ళు ముందు చేరాను. పనిలో అతనికేం తీసిపోను. ఎందుకు నన్నుపేక్షించి అతనికి పట్టం గట్టేరు?'' అడిగాడు జీవ్స్‌గ్రీన్.

''అది నీ అంచనా జీవ్స్, కంపెనీ డైరెక్టర్ల అభిప్రాయం కాదని తెలుస్తూనే వుందిగా'' అన్నాడు అశోక్ మల్‌హోత్రా.

''నువ్వు నోరు మూసుకో. నన్నెప్పటికీ ప్రెసిడెంట్ వెయ్యరన్న ధైర్యంతో మాట్లాడుతున్నావ్. ఎందరెన్ని పన్నాగాలు పన్నినా, ఆ పదవిని సాధిస్తాను'' అన్నాడు జీవ్స్‌గ్రీన్.

''విజయ్‌కంటే నువ్వే ముందు రిటయిరవుతావు కదా జీవ్స్'' అన్నాడు మోరిస్ వెంగప్ప.

''ఎవరన్నారు? నేనతనికంటే మూడేళ్ళు చిన్న. విజయ్ తరువాత నేను తప్పకుండా ప్రెసిడెంట్ అవుతాను. అంచేత విజయ్‌కి చేసినట్టు మీరంతా నాకిప్పట్నించీ దాసోహం చెయ్యండి. నే చెప్పే చిలక పలుకుల్ని అద్భుత సత్యాలుగా చాటండి. ఎప్పుడో సాధించిన మూడో తరగతి టెన్నిస్ ప్రావీణ్యాన్ని అదే పనిగా పొగడండి. నువ్వే లేకపోతే కంపెనీయే కాకుండా ప్లాంటేషన్ ఇండస్ట్రీయే పడుకుంటుందని పుబ్బేయండి'' ఆవేశంతో వూగిపోయాడు జీవ్స్‌గ్రీన్.

''జీవ్స్, నువ్వెంత గట్టిగా అరుస్తున్నావో తెలుసునా? అందరూ ఇటువైపే చూస్తున్నారు'' అన్నాడు అశోక్ మల్‌హోత్రా.

''చూస్తే చూడనీ'' అన్నాడు జీవ్స్‌గ్రీన్.

''బిలియర్డ్స్ ఆడదాం రా జీవ్స్'' అని అశోక్ మల్‌హోత్రా జీవ్స్‌గ్రీన్ భుజాల చుట్టూ చెయ్యివేసి నెమ్మదిగా నడిపించుకుని తీసుకుపోయాడు.

''జీవ్స్‌గ్రీన్ వెళ్ళిన కొద్దిసేపట్లో విజయ్‌కుమార్ భార్యతో సహా తక్కిన వాళ్ళని చేరుకున్నాడు.

''ఎప్పటి గోలేనా?'' అని అడిగాడు.


''ఆ'' అన్నాడు మోరిస్ వెంగప్ప.

''మోహన్, జీవ్స్ ప్రవర్తనకి నీకు నేను క్షమాపణలు చెప్పుకుంటున్నాను'' అన్నాడు విజయ్ కుమార్ మోహన్‌వైపు తిరిగి, ''సాధారణంగా ఇలా ప్రవర్తించడు. ఎక్కువ తాగితేనే అతనితో గొడవ''.

''పరవాలేదులే'' అన్నాడు మోహన్.

''మోహన్, నా భార్య మోనా'' భార్యని పరిచయం చేసి మోహన్‌తో అన్నాడు విజయ్‌కుమార్. ''నిన్నెప్పుడూ చూడకపోయినా నీ గురించి అన్నీ తెలుసు''.

మోనా మోహన్‌కి నమస్కారం చేసి అన్నది, ''అనుకోకుండా మిమ్మల్నిలా కలుసుకోవడం ఎంతో బాగుంది''.



మోహన్ ప్రతి నమస్కారం చేసి అన్నాడు, ''అది నా అదృష్టం. దాన్ని కొంత స్వార్థానికి ఉపయోగించుకోదలుచుకున్నాను''.

''అలాగే'' అన్నది మోనా.

''ఇంత ప్రతిభ పెట్టుకొని విజయ్ కథలు రాయకుండా చేతులు ముడుచుక్కూచోడం ఏమీ బాగాలేదు. మీరు పూనుకొని అతనిచేత మళ్ళీ రాయించే ఉపకారం చెయ్యాలి'' అన్నాడు మోహన్.

''విజయ్ నిజంగా మంచి కథలు రాస్తాడా? స్నేహితుడు కదా అని మీరు వాటిని ఆకాశానికెత్తేస్తున్నారా? నవ్వింది మోనా.

''విమర్శకులు ఏకగ్రీవంగా అతని కథా రచనకి అగ్రతాంబూలం ఇచ్చేరు'' అన్నాడు మోహన్.

''అంటే, విజయ్ పూర్తిగా కోతలు కొయ్యడం లేదన్నమాట'' అన్నది తృప్తిగా.

''అతని కథల మీద మీ అభిప్రాయమేమిటి?'' అడిగాడు మోహన్.

''అయ్యో, నాకు తెలుగు చదవడం వస్తే మీ దగ్గర ఆరాలు తియ్యడం ఎందుకు?'' అన్నది మోనా.

''చూశావా, మోహన్ ఇంత దగ్గరి వాళ్ళే నేను రాసిన కథలు చదవకపోతే ఇంక రాయడమెందుకు?'' మోహన్ కొంతసేపటి క్రితం రాయమని బలవంత పెట్టినదానికి సమాధానం దొరికినట్టు ఉత్సాహంగా అన్నాడు విజయకుమార్.

''కథలు దగ్గిరి వాళ్ళ కోసం మాత్రమే రాసేవి కావుగా?'' అన్నాడు మోహన్.

''చివరికంతేనేమో,'' అన్నాడు విజయ్‌కుమార్.

ఎవరో ఎక్కడో మెచ్చుకుంటున్నారని నెలకో, ఏళ్ళకో తరవాత వినికిడిగా తెలిస్తే ఏం తృప్తిగా వుంటుంది? రాసింది నీ చుట్టూ వున్న వాళ్ళని కదిలించ వడం చూడగలిగితేనే కదా ఇంకా రాయాలనే వుత్సాహం పుట్టేది!'' అన్నాడు విజయ్‌కుమార్.

''రాయకపోవడానికి కుంటి సాకులు వెతుకుతున్నావ్. నువ్వు చెప్పిందే నిజమైతే పదేళ్ళపాటు ఇవే పరిస్థితులలో ఎలా రాయగలిగావ్?'' అన్నాడు మోహన్.

''ఆ ప్రశ్నే నేనూ అప్పుడప్పుడు వేసుకుంటూ వుంటాను. అప్పట్లో మీ విమర్శకుల మెప్పుకంటే ఆనందాన్నిచ్చే అనుభూతి నా పరిధిలో లేకపోయి వుండవచ్చనిపిస్తుంది. ఎదిగిన కొద్దీ అంతకంటే హాయినిచ్చే కొత్త అనుభవాలు దాన్ని నెట్టి ఆ స్థానం ఆక్రమించుకొని వుంటాయి.''

''విషయ వాంఛల్ని తీర్చుకోడంలో కలిగే సంతృప్తికీ, సాహిత్యాన్ని సృష్టించగలిగినప్పుడు పొందే రసానుభూతికీ సాపత్యం తెస్తున్నావా విజయ్?'' మిన్ను విరిగి మీద పడ్డంత బాధపడ్డాడు మోహన్.

''తరచి చూస్తే అన్నీ విషయవాంఛలేననిపిస్తుంది మోహన్'' అన్నాడు విజయ్‌కుమార్. ''ఏది దేనికంటే ఎక్కువ వాంఛించతగిందో, ఏది ఎప్పుడు ఎవరికి ఎంత ఆనందమిస్తుందో ఎలా చెప్పగలం?''

''రాయాలనే తృష్ణ మాటేమిటి?'' అడిగాడు మోహన్.

''కొంచెం పేరు రాగానే దానంతట అదే అడుగంటి


బోయ జంగయ్య నవలిక

జాతర

వస్తుంది త్వరలో

పోతుంది'' అన్నాడు విజయ్‌కుమార్.

''వింతగా మాట్లాడకు విజయ్. పేరూ, ప్రఖ్యాతీ ఇంకా ఎక్కువ రాయడానికి దోహదం చెయ్యాలి'' అన్నాడు మోహన్.

''పేరు రాగానే తక్కిన కళాకారుల్లాగే రచయిత కూడా అభిమానులకి స్వాధీనం అయిపోతాడేమోనని నా అనుమానం. ఆ తరువాత తాపత్రయం రాసేది వాళ్ళ ఆమోదాన్నీ, ఆదరాన్నీ పొందుతుందా, పొందదా అనే. ఎంతో కొంత కాలానికి ఈ పరిణామం మీద విసుగు పుట్టి, ఏమయితే అయింది స్వేచ్ఛగా రాద్దామన్న తీవ్రమైన కోరిక పుట్టక తప్పదు. రాయడమే వృత్తిగా పెట్టుకుంటే అలా చెయ్యకా తప్పదు. ఎటొచ్చీ అడపా తడపా రాసే వాళ్ళకే సమస్య'' అన్నాడు విజయ్‌కుమార్.

''నువ్వు చెపుతున్న సమస్యేమిటో నాకు మాత్రం బోధపడ్డం లేదు'' అన్నాడు మోహన్.

''గడించిన పేరుని భద్రంగా రక్షించుకుంటూ రాయడం మానెయ్యాలా, చిత్తశుద్ధితో రాసి ఆకట్టుకున్న వాళ్ళ అభిమానాన్ని పోగొట్టుకునే ప్రమాదాన్ని ఎదుర్కోవాలా?''

''ఇంతే కదా. నువ్వు సతమతమవ్వవలసిన సమస్య కాదులే ఇది. నీ రాతల మీద ఒక ముద్ర వెయ్యకుండా, వాటికి బ్రహ్మరథం పట్టే వాళ్ళం ఇంకా కొరవడ లేదుగా'' అన్నాడు మోహన్ గండం గడిచి బయట పడ్డంత కుదుటుగా.

''మీరు పాతబడిపోయారు మోహన్. మీ ప్రేరణ చాలదు. మీరెక్కడో, నేనెక్కడో. ఇప్పుడు కొత్త ప్రేరణ కావాలి. ఇక్కడున్న ఇటువంటి వాళ్ళు పూనుకుంటే ఏవైనా పని జరుగుతుందేమో'' కొంటెగా భార్య వైపు చూస్తూ అన్నాడు విజయ్‌కుమార్.

''మోహన్, విజయ్ చేత మళ్ళీ రాయించడానికి మీరనవసరంగా ప్రయాసపడుతున్నారు. ఏ కొంచెం సమయం చిక్కినా టెన్నిస్‌లో తక్కువ వాళ్ళను ఓడిస్తానో, కంపెనీకి లాభాలు తనొక్కడివల్లే వొస్తున్నాయని ప్రగల్భాలు కొడుతూనో, మాటల చాతుర్యంతో అందర్నీ అలరిస్తున్నానని భ్రమపడుతూనో గడిపేస్తాడు కానీ కథరాసి మీ విమర్శల కోసం ఆదుర్దాగా ఎదురు చూస్తూ కూచోడు'' ఎద్దేవా చేస్తూనే భర్త బహుముఖ పాటవాల్ని తెలివిగా చాటింది మోనా.

''చేతిలో వున్న ఒక పక్షి చెట్టు మీది రెండు పక్షులతో సమానమనిగదా!'' నవ్వాడు విజయ్‌కుమార్.

''విజయ్ వాగ్యుద్ధం చాలించి మీ స్నేహితుడికి ఇంకొక డ్రింక్ ఇయ్యి గ్లాసు ఖాళీ అయి అయిదు నిముషాలయింది'' అన్నది మోనా.

''నేను చూడ్లేదు'' అన్నాడు విజయ్‌కుమార్. బార్‌మన్‌ని పిలిచి అందరికీ విస్కీ ఆదేశించాడు.

''డయానా వచ్చేసినట్టుంది'' అన్నది మోనా.

''ఏది?'' అన్నాడు విజయ్‌కుమార్.

''అదిగో బార్లోకే వొస్తోంది'' అన్నది మోనా.

డయానా, రాబర్ట్ కొయిలో తిన్నగా విజయ్ బృందం దగ్గరికి వచ్చారు.

డయనా అయిదడుగుల ఆరంగుళాల మనిషి. స్ఫురద్రూపి. మోకాళ్ళ క్రిందికి వేసుకున్న నల్లటి ఫ్రాక్ గులాబీ రంగు శరీర ఛాయని ఇనుమడిస్తోంది. భుజాల వరకు కత్తిరించిన ఒత్తయిన జుట్టు పట్టులాగా నిగనిగలాడుతోంది. డయనాని చూసినవాళ్ళకి మళ్ళీ మళ్ళీ చూడాలనిపిస్తుంది. ఆరుగురు పిల్లల తల్లి అంటే ఎవ్వరూ నమ్మరు.

''స్వాగతం డయనా, ఎప్పుడు విచ్చేశావ్?'' అని సున్నితంగా డయనా బుగ్గమీద ముద్దుపెట్టాడు విజయ్‌కుమార్. డయనా అతని బుగ్గ మీద ప్రతి చుంబనం చేసి. నవ్వుతూ అంది ''ఈ వాళే.''

రాబర్ట్ కొయిలోనీ, డయానానీ మోహన్‌కి పరిచయం చేసి విజయ్‌కుమార్ మోహన్‌తో చెప్పాడు ''రాబర్ట్‌కి మా కంపెనీ ఎస్టేట్ల మధ్యలో వెయ్యి ఎకరాల టీ ఎస్టేటు వుంది. మా పద్ధతులన్నీ పొంచి చూచి తన ఎస్టేట్లో అమలుపెడుతూ వుంటాడు. దొంగ బుద్ధి వొదల్లేకపోతే పోన్లే కొంత రాయల్టీ అయినా పారెయ్యవయ్యా అంటే నసుగుతాడు కానీ ఇవ్వడు.''

''తన మీద నేను చెయ్యవలసిన ఫిర్యాదు నా మీదే ఫిరాయించాడు విజయ్'' అన్నాడు రాబర్ట్ కొయిలో.

''అతని ఆఫీసర్లనడక్కండి మోహన్ ఇంకెక్కడెవర్నయినా అడగండి ఎవరు ఎవరి పద్ధతుల్ని దొంగతనంగా గుత్తం చేసుకున్నారో, ఎలా విజయ్ మూనార్ ప్లాంటేషన్లని నష్టాల్లోంచి లాభాల్లోకి లాక్కురాగలిగాడో'' ఎత్తిపొడుపుల్లో స్వారస్యాన్ని పూర్తిగా అనుభవించాడు రాబర్ట్ కొయిలో.

రాబర్ట్ కొయిలో ఆరడుగుల పొడుగు. కాయకష్టం చేసేవాడిలా ధృడమైన కాయం. వెయ్యి ఎకరాలకి అధిపతిలాగా కనిపించడు. సగం నెరిసిన జుట్టు, ముప్పాతిక నెరిసిన మీసకట్టు. ఆకారానికి తగ్గట్టు పాతకాలపు గ్రే ట్రౌజర్స్, దాని మీద ముదురు నీలం రంగు బ్లేజరూ, ఇటిక రంగు నెక్‌టై. ఎప్పుడూ పెదవుల మీద చిరుహాసం నాట్యం చేస్తూ వుంటుంది.

మోనా, డయనా ఆప్యాయంగా కౌగలించుకుని ఒకళ్ళ బుగ్గ మీద ఒకళ్ళు ముద్దు పెట్టుకున్నారు.

''పాప ఎలా వుంది?'' అడిగింది మోనా.

''బాగానే వుంది'' డయనా.

''కాన్పు కష్టమైందట గదా?''

''అవును. సిజేరియన్''

''ఇంక నువ్వు పిల్లల్ని ఆపెయ్యాలి రాబర్ట్,'' అన్నాడు విజయ్‌కుమార్ రాబర్ట్ కొయిలో వైపు తిరిగి.

''మా కేథలిక్స్ సంతాన నిరోధం పాటించరు'' అన్నాడు రాబర్ట్ కొయిలో.

''ఇటువంటి కబుర్లు చెప్పావంటే నీ ఎత్తులు డయనాకి చెప్పేస్తాను'' అన్నాడు విజయ్‌కుమార్.

''చెప్పుకో ఫరవాలేదు'' అన్నాడు రాబర్ట్ కొయిలో.

''డయనా'' అన్నాడు విజయ్‌కుమార్. ''నువ్వెంత భువనైకసుందరివైనా మీ ఆయనకింత అసూయ పనికిరాదు. ప్రతి ఏడాదీ కాన్పులో పెట్టి నిన్ను మాతో కలవనియ్యకుండా కట్టదిట్టం చేసుకుంటున్నాడు.''

''చిలిపిగా మాట్లాడకు విజయ్'' అంది డయనా.


విజయ్‌కుమార్ పొగడ్తలకి సిగ్గూ, ఆనందమూ కూడా కలిగాయి డయనాకి.

''నువ్వు వుత్తి అమాయకురాలివి డయనా. రాబర్ట్ ఆటలు ఇలాగే సాగనిచ్చావంటే నీ ఆకర్షణ పూర్తిగా హరించిపోయే వరకూ నీకు కాన్పుల బెడద తప్పనివ్వడు'' నవ్వాడు విజయ్‌కుమార్.

''ఈ ఆకర్షనేదో పోయే ముందే నా భార్యతో డాన్స్ చెయ్యాలి'' అని రాబర్ట్ కొయిలో డయనా చెయ్యి అందిపుచ్చుకుని డాన్స్ ఫ్లోర్ వైపు వెళ్ళిపోయాడు.

''రాబర్ట్ నలభై అయిదోఏట ఇరవై ఏళ్ళ డయనాని పెళ్ళి చేసుకున్నాడని విజయ్ అతన్ని ఆట పట్టిస్తూ వుంటాడు'' భర్త చేష్టలు అల్లరిగా వున్నాయని మోహన్ అనుకుంటాడేమోనని మోనా వివరించింది.

అప్పుడే బార్‌లోకి అడుగు పెడుతున్న డాక్టర్ నారా



యంగ్ విజయ్‌కుమార్‌ని చూసి దగ్గరికి వచ్చి "గుడీవినింగ్" అన్నాడు.

"గుడీవినింగ్ డాక్. ఏం ఇంత ఆలస్యమయింది? బ్రిడ్జి ఆటగాళ్ళు నీ కోసం కాలుగాలిన పిల్లుల్లా తిరుగుతున్నారు" అన్నాడు విజయ్‌కుమార్.

"ఏం చెయ్యడం? మీ అసిస్టెంట్ మేనేజర్ సానీ చేసిన నిర్వాకం" అన్నాడు డాక్టర్ నారాయణ్.

"ఏమైంది?"

"ఎస్టేట్ రోడ్లు రేస్ ట్రాక్‌లనుకొని మోటర్ సైకిల్ని పరిగెత్తిస్తే ఏమవుతుంది? మళ్ళీ ఏక్సిడెంట్. పది కుట్లు వెయ్యాల్సి వచ్చింది. ఇప్పటికి తెలివిలింది."

"డాక్టర్ నా స్నేహితుడు మోహన్" అని డాక్టర్ నారాయణ్‌కి మోహన్‌ని పరిచయం చేసి మోహన్‌తో అన్నాడు "డాక్టర్ నారాయణ్ మా కంపెనీకి చీఫ్ మెడికల్ ఆఫీసర్."

"ప్రమాదం లేదుకదా" డాక్టర్ నారాయణ్‌ని అడిగాడు మోహన్, ఎలా సంభాషణ మొదలు పెట్టాలో తెలీక.

"ఇప్పటికి లేదు. మళ్ళీ ఎప్పుడు ఏక్సిడెంట్‌లో ఇరుక్కుని వస్తాడో చెప్పలేం. తొమ్మిది నెలల్లో ఇది మూడవ సారి" అన్నాడు డాక్టర్ నారాయణ్.

"మరీ అంత విసుక్కోకు డాక్. తొమ్మిదేళ్ళల్లో కూడా ఇది మూడోసారే కదా!... దానికేంలే గానీ, ముందొక విస్కీ తాగు. మర్చిపోయాను మీ డ్రింక్ జిన్ అండ్ బిట్టర్స్ గదా" అని జిన్ అండ్ బిట్టర్స్ తెమ్మని బేరర్ని అడిగాడు విజయ్‌కుమార్.

"విజయ్ సానీని నువ్వు హెచ్చరించాలి. అంత జోరు పనికిరాదు" అన్నాడు డాక్టర్ నారాయణ్.

"అతని జోరు మోరిస్ ఒక్కడే తగ్గించగలడు" అన్నాడు విజయ్‌కుమార్.

విజయ్‌కుమార్ మాటలకి మోరిస్ చెంగప్ప చాలా సంబరపడిపోయాడు.

"తప్పకుండా చేస్తాను. హాస్పిటల్ నుంచి రాగానే పిలిచి బుద్ధి చెప్తాను" అన్నాడు.

"అది పని చెయ్యదు మోరిస్" అన్నాడు విజయ్‌కుమార్.

"ఏం" అడిగాడు మోరిస్ చెంగప్ప.

"సానీ మేనేజరుతో ఎప్పుడూ ఘర్షణ పడుతున్నాడని మీ పెర్సనల్ డిపార్ట్‌మెంట్ నాలుగైదు నెలల క్రితం రాసిన రిపోర్టు గుర్తుందా?"

"లేకేం. గొడవ ఇప్పుడు మరీ ఎక్కువయిపోయింది. ఏం చెయ్యడానికీ పాలుపోడంలేదు."

"మరి?"

"నిన్ను సంప్రదిద్దామనుకుంటున్నాను."

"సానీ ఎంత కాలం నుంచి ఈ మేనేజర్‌తో పని చేస్తున్నాడు."

"దగ్గర దగ్గర ఏడాది నుంచి."

"మన దగ్గర తొమ్మిదేళ్ళుగా వున్నట్టున్నాడు కదూ?"

"అవును."



# బి.యన్. భాషితాలు

మూన్నాళ్ళ ముచ్చట ఈ జీవితం
ఎందుకింత మిడిసిపడటం?
మహామహులనే మరిపించిన ఈ ప్రపంచంలో
మనమెంత-మన బ్రతుకెంత?

** ** **

నేను - నా ఇల్లు
నా ఆస్తి - నా పిల్లలు
అనే మత్తు అంతా ఒక్కసారే
దిగిపోతుంది మృత్యు దేవత పిలుపు రాగానే—

** ** **

జీవితం పొడుగునా
నా కష్టాలు కన్నీళ్ళు ఎవరు భరిస్తారు
నా ప్రాణం కూడా వెళ్ళిపోయింది చివరికి
నా కష్టాలు చూడలేక—

** ** **

ఒక దినం పెళ్ళి కొరకు
సంవత్సరం పొడుగునా హంగామా చేసినట్లు
జీవితమంతా ఆయాసపడుతున్నాం
ఒక దినం చావడానికి—

** ** **

నీఆస్తి నీ కొడుకులు కొట్టేసిరి
నీ డబ్బు నీ కూతుళ్ళు కాజేసిరి
నీ సమాధి వరకు వచ్చిన బంధుమిత్రులు తిరిగి
ఇంటికెళ్ళిరి,
నీకు మిగిలింది నీ మంచీ చెడు-అంతే.

వాస్తు శిల్పి బి.ఎన్. రెడ్డి

"ఈ తొమ్మిదేళ్ళలో ఇంకే మేనేజర్లతోనైనా అనుచితంగా ప్రవర్తించాడా?"

"లేదు."

"అకస్మాత్తుగా ఇలా ఎందుకు మారిపోయాడంటావ్?"

"అదే అర్థం కావడం లేదు. వాళ్ళ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది."

"ఈ మేనేజర్ జులుంతో సానీ ఎందుకో ఇముడలేకపోతున్నాడనిపిస్తోంది నాకు. ఎదిరించి సాధించడానికి కంపెనీ వాతావరణం సహకరించదు. అంచేత నిస్సహాయత, నిస్పృహ. అది కసి, నిర్లక్ష్యంగా మారింది మేనేజర్ మీద, కంపెనీ మీద, జీవితం మీద. అందుకే ఈ దుండగప్పనులు సానీని నువ్వు ఈ మేనేజర్ నుంచి తప్పించేస్తే గానీ డాక్టర్ నారాయణ్‌కి కుట్లు వేసే పనీ తప్పదు, బ్రిడ్జి స్నేహితులు అతని రాకకోసం కళ్ళు కాయలు కాసేలా చూస్తూ కూచోకా తప్పదు" అన్నాడు విజయ్‌కుమార్.

మోరిస్ చెంగప్ప అత్యంత అణుకువగా విజయ్‌కుమార్ కుడిచేతిని తన చేతుల్లోకి తీసుకొని అన్నాడు "విజయ్, అరటిపండు వొలిచి చేతిలో పెట్టినట్టు చెప్పావ్. నా చిక్కు విడిపోయింది. రేపే నువ్వు చెప్పినట్లు చేస్తాను" అన్నాడు.

"అదిగో, ఎడ్డీసేత్నా ఇంకొక చిలకని వెంటబెట్టుకొని వస్తున్నాడు" అన్నాడు డాక్టర్ నారాయణ్ అకస్మాత్తుగా.

అందరూ గుమ్మం వైపు తిరిగారు.

ఎడ్డీ సేత్నాతో ఇరవై, ఇరవై రెండేళ్ళ పడుచు బార్లోకి అడుగు పెడుతూ కన్పించింది. మంచి పరువంలో వుంది. కను ముక్కు తీరుకంటే, అంగ సౌష్ఠవం చూపరుల్ని ఎక్కువ ఆకట్టుకుంటుంది.

"ఎడ్డీ అభిరుచిని మాత్రం ఎవరూ వేలెత్తి చూపించలేరు" అన్నాడు విజయ్‌కుమార్.

"విజయ్, ఎడ్డీని పిలిచి ఈ అమ్మాయి కూడా మేనకోడలేనేమో అడుగుదామా" నవ్వాడు డాక్టర్ నారాయణ్.

విజయ్‌కుమార్ మోహన్ వైపు తిరిగి అన్నాడు "సేత్నా ఇక్కడ పెద్ద కాంట్రాక్టర్. ఇంకా పెళ్ళి చేసుకోలేదు. కొంతమంది ఆడపిల్లల్తో సంబంధం వుంది. వాళ్ళని మేనకోడళ్ళని చెప్తాడు."

"కొంత మందా? నేను లెక్కపెట్టలేక వదిలేశాను" మళ్ళీ నవ్వాడు డాక్టర్ నారాయణ్. అక్కడి వాళ్ళతో మాట్లాడుతున్నా డాక్టర్ చూపులు మాత్రం ఎడ్డీ సేత్నాతో వున్న అమ్మాయి మీదే లగ్నమై వున్నాయి.

"ఎడ్డీ కూడా నీ లాగే డాక్" అన్నాడు విజయ్‌కుమార్.

వీపు మీద చరిచినట్టయింది డాక్టర్ నారాయణ్‌కి.

"ఏయ్, ఏవంటున్నావ్ విజయ్! మానభంగం కేసు పెడతాను, జాగ్రత్త" అన్నాడు విజయ్‌కుమార్ వైపు తిరిగి నవ్వుతూ.

"లేనిదేవీ అనడం లేదు డాక్" అన్నాడు విజయ్

కుమార్.

మోహన్‌కి నవ్వొచ్చింది. డాక్టర్ నారాయణ్ సుమారు అరవై ఏళ్ళున్న వాడిలా కనిపిస్తాడు. నుదుటి మీద అడ్డంగా విభూది చారలు, మధ్య కుంకం బొట్టు. బట్టతల. చెంపలూ, వెనకా పూర్తిగా నెరిసిపోయాయి. నడినెత్తిమీద ఒకటీ అరా వెంట్రుకలు మాత్రం సగం సగం నెరిశాయి.

"పంకజం ఇక్కడెక్కడా లేదుగదా" డాక్టర్ నారాయణ్ బారంతా కలయచూశాడు.

"భయపడకు డాక్. నీ భార్య హాయిగా రమ్మీ ఆడుకుంటూ వుంటుంది" అన్నాడు విజయ్ కుమార్.

"డాక్టర్‌గారు రసికుడన్నమాట" నవ్వాడు మోహన్.

"విజయ్ మాటలు నమ్మకండి మోహన్" అన్నాడు డాక్టర్ నారాయణ్.

"నన్నపార్థం చేసుకొని గుమ్మడికాయల దొంగంటే భుజాలు తడుముకుంటున్నావ్ డాక్" అన్నాడు విజయ్.

"సంతోషం. అయితే నీ మనసులో వున్నదేమిటో సూటిగా చెప్పు" అన్నాడు డాక్టర్ నారాయణ్.

"ఇష్టమైన ఏదో ఒక దేవుణ్ణి పూజించుకోకుండా నువ్వెందుకు రోజుకో దేవుడికీ, పూటకో దేవుడికీ పూజలు చేస్తావ్" అన్నాడు విజయ్‌కుమార్.

"విజయ్, నీకు హిందూ మతం గురించి ఏవీ తెలిసినట్టు లేదు. అనంతమైన భగవంతుడి ఆకారాలన్నిటినీ ఒకే మూర్తితో ప్రదర్శిస్తే అవగాహనం చేసుకునే శక్తి ఎంతో మందికి వుండదు. అందుకే ఒక్కొక్క స్వరూపానికీ ఒక్కొక్క స్వభావాన్ని ఆపాదించి భజించి తరించడం. ఈ దశ దాటిన తరవాత కానీ ఏకో: నారాయణ అన్న స్పృహ కోసం ప్రయత్నం చెయ్యలేం" అన్నాడు డాక్టర్ నారాయణ్.

ఇంత వరకూ మాట్లాడిన డాక్టర్ నారాయణ్‌కీ ఇప్పుడు మాట్లాడుతున్న డాక్టర్ నారాయణ్‌కీ పోలికే లేదు. తాగుడికీ, నవ్వులకీ, ప్రెసిడెంట్ చమకులకీ, సంగీతం రొదలకీ అతీతుడుగా కనిపించాడు.

"ఎడ్డీ సేత్నా ఆడవాళ్ళ విషయంలో ప్రాథమిక అన్వేషణ దశలోనే వున్నాడని ఎప్పుడైనా అనిపించిందా డాక్ నీకు? ఏ ఒక్క స్త్రీ కాని అతనికి ఇంతవరకు పరిపూర్ణ వుద్వేగం ఇచ్చి వుండదు. ఒక్కొక్కళ్ళ దగ్గిరా ఒక్కొక్క అనుభూతి" కళ్ళు చికిలించి నవ్వాడు విజయ్‌కుమార్.

విజయ్‌కుమార్ మాటలకి డాక్టర్ నారాయణ్ తిరిగి మనుషుల్లో పడ్డాడు.

"మంచి చమత్కారంగా మాట్లాడతావ్" అని విజయ్‌కుమార్ దగ్గరికి జరిగి మెచ్చినట్టు వీపు మీద చరిచాడు.

అప్పుడే సతీష్ వచ్చాడు. "స్నేహితుల కబుర్లు ఇంకా తరగలేదా?" అన్నాడు విజయ్‌కుమార్‌ని, మోహన్ని వుద్దేశించి.

"సతీష్, ఎందుకు నా స్నేహితుణ్ణి లాక్కుపోతున్నావ్? నువ్వూ, మోహన్ భోజనానికి మాతో జేరకూడదా?" అన్నాడు విజయ్‌కుమార్.

"విజయ్ ఈ వాళ కుదరదు. మోహన్ ఇంకా నాలుగు రోజులుంటాడు. ఒక సాయంత్రం మీ ఇంటికి తీసుకొస్తాను" అన్నాడు సతీష్.

"నువ్వు మాట తప్పనంటేనే మోహన్‌ని వెళ్ళనిస్తాను" అన్నాడు విజయ్‌కుమార్.

"రేపు రమ్మంటావా?" అడిగాడు సతీష్.

"తప్పకుండా. ఏడున్నరకి, భోజనానికి వుండాలండి. ప్రభని కూడా తీసుకురా. మోనా ప్రభతో చెప్తుందిలే" అన్నాడు విజయ్‌కుమార్.

మోహన్ వైపు తిరిగి కరచాలనానికి చెయ్యి అందిచ్చి అన్నాడు విజయ్‌కుమార్ "రేపు కలుసుకుందాం."

మోహన్ కుడిచేత్తో అందిపుచ్చుకుని ఎడం చెయ్యి ఆప్యాయంగా దానిమీద కప్పి అన్నాడు. "నువ్వు మళ్ళీ కథలు రాయాలి విజయ్. నీలో కథకుడు ఇంకా సజీవంగా వున్నాడనిపిస్తోంది నాకు.

"చూద్దాం" అన్నాడు విజయ్‌కుమార్.

"అలా కాదు, నా తృప్తికోసం ఒక్క కథ రాయి. తరువాత అవే ప్రవాహంలా పొర్లుకొస్తాయి. రాస్తాననే వరకూ నీ చెయ్యి వదలను" అన్నాడు మోహన్.

విజయ్ కుమార్ మాట్లాడలేదు. నెమ్మదిగా చెయ్యి విడిపించుకుని మోహన్‌ని కౌగలించుకున్నాడు. "రేపు ఇంటికి రావాలి మర్చిపోకు" అన్నాడు.

* * * * *

మోహన్ తిరిగి సతీష్ బృందాన్ని చేరగానే గోపాల్ అడిగాడు "మళ్ళీ కథలు రాయడానికి మీ స్నేహితుణ్ణి ఒప్పించలేదు కదా?"

"ప్రయత్నించాను" అన్నాడు మోహన్.

"ఏమి స్నేహితులండీ మీరు! ఆ పని చెయ్యద్దని ఎంత వేడుకున్నాను" అన్నాడు గోపాల్.

"కథలల్లాలనే తపనా, రక్తికట్టేలా చెప్పగలిగిన శక్తీ విజయ్‌లో ఇంకా చెక్కుచెదరలేదనిపించి మళ్ళీ రాయమని బలవంతపెట్టకుండా వుండలేకపోయాను" అన్నాడు మోహన్.

"చంపేశారు" అన్నాడు గోపాల్.

"భయపడకండి" నవ్వాడు మోహన్.

"మళ్ళీ ఏదో ఆశపెడుతున్నారు" ఆత్రంగా అన్నాడు గోపాల్.

"విజయ్ చెప్పే కథలు వింటూ, ఆహా అని జే కొట్టడానికి మీరంతా వున్నంతకాలం అతను మళ్ళీ కథలు రాసే ప్రమాదం లేదేమో లెండి" అన్నాడు మోహన్. అతని గొంతుకలో విచారం స్ఫురించింది.

"మీ మాట నమ్మొచ్చా?" అడిగాడు గోపాల్.

"నా ఉద్దేశం తప్పకావాలని నా ఆశ. అవుతుందన్న ధైర్యం మాత్రం లేదు" అన్నాడు మోహన్.

గోపాల్ మొహం వికసించింది.

"ఇంత చల్లటి కబురు అందించినందుకు మీకు అపూర్వమైన విస్కీ సమర్పించుకోవలసిందే" అన్నాడు.

బార్‌మన్‌ని పిలిచి అందరికీ రాయల్ సాల్యూట్ విస్కీ తెమ్మని ఆదేశించాడు.

"మీ మాట పొల్లుపోదని ఆశిస్తూ" గోపాల్ విస్కీ గ్లాసుని కుడిచేత్తో పైకెత్తి అన్నాడు. మోహన్ పరధ్యానంగా వుండి తన గ్లాసుని ఎత్తలేదు. గోపాల్ తక్కిన స్నేహితుల వైపు తిరిగి వాళ్ళ గ్లాసులతో తన గ్లాసుని వినదించి అన్నాడు,

"ఛీయర్స్"

"గుడ్‌లక్" బదులు చెప్పారు స్నేహితులు.

